నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

పాడేరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 27న రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో సురక్షితంగా ఉండాలని సూచించారు.

పర్యాటక స్వర్గధామం

సహజ సిద్ధ అందాలు... అభివృద్ధి చేస్తే అద్భుతాలు

- ఏజెన్సీలో ఎటు చూసినా ఆకట్టుకునే సుందర ప్రదేశాలే
- ప్రతి ఏడాది పది లక్షల మంది ఏజెన్సీ ప్రాంతాల సందర్శన
- పర్యాటకాభివృద్ధిని పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చిగురించిన ఆశలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా..


పెదబయలు మండలంలో తారాబు జలపాతం


వలిసె పూలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

సహజ సిద్ధ ప్రకృతి అందాలకు నెలవు మన్యం ప్రాంతం. దేశ, విదేశీ పర్యాటకులు సైతం ఇక్కడి అందాలకు ఫిదా అవుతారు. అందుకే ఇది పర్యాటక స్వర్గధామంగా విరాజిల్లుతోంది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పర్యాటకాభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై పర్యాటకులు సైతం పెదవివిరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందరిలో ఆశలు చిగురించాయి. మన్యంలో పర్యాటకం ఊపందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మన్యంలోని పర్యాటక ప్రదేశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఎటు చూసినా పచ్చని కొండలు, గలగల పారే సెలయేళ్లు, ఉరికే జలపాతాలు, కొండలను చుట్టిన పాములా మెలికలు తిరిగిన ఘాట్ మార్గం, అటు అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు మొదలుకుని అక్కడికి సమీపంలోని జలపాతాలు, ఘాట్‌లోని కాఫీ తోటలు, అరకులోయ చేరుకునే వరకు కనుచూపు మేర పచ్చదనం పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. అరకులోయలోని గిరిజన మ్యూజియం, మాడగడ వ్యూపాయింట్, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడలోని చాపరాయి, కొల్లాపుట్ జలపాతం, హుకుంపేట మండలంలోని మత్స్యగుండం తిలకించి పర్యాటకులు పాడేరు చేరుకుంటున్నారు. అలాగే విశాఖపట్నం నుంచి చోడవరం మీదుగా పాడేరు ఘాట్ మార్గంలో ప్రయాణిస్తూ పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాలకు తరలివస్తుంటారు.

ఎన్నెన్నో అందాలు

అరకులోయ, బొర్రా గుహల సందర్శన అనంతరం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్నవి పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలోని చెరువులవేనం ప్రాంతాలు. శీతాకాలంలో(పర్యాటక సీజన్) కశ్మీరు అందాలను తలదన్నేలా వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం, చెరువులవేనం దర్శనమిస్తాయి. పిక్నిక్‌ల సీజన్‌లో ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఆ మూడు ప్రదేశాలను తిలకించకుండా తిరిగి వెళ్లరంటే అతిశయోక్తి కాదు. ఆ తరువాత లంబసింగి పరిసరాల్లో స్ట్రాబెరీ తోటలు, సీలేరు జలవిద్యుత్ కేంద్రం, ధారాలమ్మ ఆలయం ... మిగతా 8వ పేజీలో


వంజంగి హిల్స్‌లో మంచు మేఘాలు

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

- ఇదీ బొర్రాగుహల పరిస్థితి

అనంతగిరి, సెప్టెంబరు 26: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ప్రతి ఏటా ఆరు లక్షల మందికి పైగా పర్యాటకులు రావడంతో సుమారు రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పనపై పర్యాటక శాఖాధికారులు దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుహలు లోపలకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన మెట్లకు కడప స్టోన్ వాడారు. అయితే 20 ఏళ్ల క్రితం నిర్మించినవి కాబట్టి మెట్లు పూర్తిగా అరిగిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల పూర్తిగా ఊడిపోయి అధ్వానంగా ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు పర్యాటకులు జారి పడి గాయాలపాలవుతున్నారు. అలాగే మెట్లను ఆనుకుని ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ ఎక్కడికక్కడ ఊడిపోయాయి. మానవ మెదడు శిల ప్రదేశం వద్ద ఉన్న రెయిలింగ్ పూర్తిగా విరిగిపడింది. ప్రమాదాలు జరగకుండా ఇక్కడ తాళ్లు కట్టారు. కాగా బొర్రాగుహల అభివృద్ధికి స్వదేశీ దర్శనకింద రూ.29.88 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఆరు నెలలు దాటినప్పటికీ అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాలేదు.


బొర్రాగుహలు లోపల మానవ మెదడు శిల వద్ద ఇనుప రెయిలింగ్ విరిగిపోవడంతో తాళ్లు కట్టిన దృశ్యం

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

సీసీఎఫ్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి

- కృష్ణాపురంలో ఎకో టూరిజం ప్రాజెక్టు ప్రారంభం


టెంట్ హట్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

చింతపల్లి, సెప్టెంబరు 26: గిరిజన ప్రాంతంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(సీసీఎఫ్) ఎస్.శ్రీకంఠనాథరెడ్డి తెలిపారు. గురువారం చింతపల్లి మండలంలో పర్యటించిన ఆయన కృష్ణాపురంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించిన ఎకో టూరిజం ప్రాజెక్టును ప్రారంభించారు. ఇక్కడి సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లంబసింగికి ప్రతి ఏటా వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. ప్రకృతిని ఆస్వాదించాలని భావించే పర్యాటకులకు మంచి ఆతిథ్యం అందించాలనే లక్ష్యంతో కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టును ఏర్పాటు చేశామన్నారు. లంబసింగి వచ్చే పర్యాటకులు ఎకో టూరిజంలో బస చేసి ఎంజాయ్ చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద పచ్చని గార్డెన్, నాలుగు కిలో మీటర్ల ట్రెక్కింగ్ పాత్, 25 టెంట్ హట్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మరో 15 రోజుల్లో పూర్తి స్థాయిలో ఎకో టూరిజం ప్రాజెక్టు పర్యాటకులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను స్థానిక వీఎస్ఎస్ గిరిజనులకు అప్పగించామన్నారు. రానున్న రోజుల్లో ట్రీహట్స్, కాన్ఫరెన్స్ హాల్ నిర్మిస్తామన్నారు.

జలపాతాల వద్ద మౌలిక సదుపాయాలు

అటవీశాఖ పరిధిలో ఉన్న జలపాతాల వద్ద పర్యాటకుల కోసం కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రధానంగా లంబసింగి, యర్రవరం జలపాతాల వద్ద పర్యాటకుల కోసం మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. అటవీ సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక అభివృద్ధికి పర్యాటక శాఖ కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎఫ్‌వో చిట్టపులి సూర్యనారాయణ, రేంజ్ అధికారులు బి. అప్పారావు, ఎల్‌బీకే పాత్రుడు, డీవీబీ వర్మ, కె.శ్రీనివాసరావు, శివరంజిని, డీఆర్వో వెంకటరాజు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో లోకేశ్


నారా లోకేశ్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సింహాచలం ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు

విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఉన్నారు.

విశాఖలో మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్ - వార్త 7వ పేజీలో..

ఆర్డీఓలు బదిలీ

ఉమ్మడి జిల్లాలో నలుగురికీ స్థానం చలనం

- అనకాపల్లికి షేక్ ఆయేషా, నర్సీపట్నానికి వెంకట రమణ
- ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని చిన్నికృష్ణ, జయరామ్‌లకు ఆదేశాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 26: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నలుగురు ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరితోపాటు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, వీఎంఆర్డీఏ కార్యదర్శికి కూడా స్థానచలనం కల్పించారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ ... మిగతా 8వ పేజీలో

ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశం
- హెచ్‌ఎంలు వార్డెన్లుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



సమావేశంలో పాల్గొన్న ఏటీడబ్ల్యూవోలు, ఆశ్రమాల హెచ్‌ఎంలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. ఏజెన్సీ పదకొండు మండలాల ఏటీడబ్ల్యూవోలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఆశ్రమాల హెచ్‌ఎంలతో గురువారం ఐటీడీఏలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే నిత్యావసర సరకులు నాణ్యతగా లేకుంటే తిరస్కరించాలని సూచించారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందిస్తే ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను బట్టి బోధన చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులు మూడో తరగతి పాఠ్యాంశాలను కూడా చదవలేకపోతున్నారని ఐటీడీఏ పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబరు 1 నుంచి 31 వరకు వెనుకబడిన విద్యార్థులను బాగా చదివించి నవంబరు 15న విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పరిశీలించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేకంగా సిక్ రూమ్ ఏర్పాటు చేయాలని, అనారోగ్య సమస్యలుంటే సిక్ రూమ్‌లో ఉంచి ఒక పూట గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించాలన్నారు. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని వస్తే విశాఖపట్నం తరలించి వైద్యం అందిస్తామన్నారు. అలాగే ప్రతి నెలా మూడో శనివారం శ్రమదానంతో విద్యాలయాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిరంతరం వైద్య సమస్య పరిష్కారానికి, అంబులెన్సులను సమకూర్చడానికి కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యలను 08935 51737 లేదా 63039 21374 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. కెరీర్ గైడెన్స్‌పై టీచర్లకు శిక్షణ అందిస్తామన్నారు. ప్రకాశం జిల్లా నుంచి మార్గదర్శి అనే కెరీర్ గైడెన్స్ సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరంలో శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని, ప్రతి మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ అందించి అనంతరం వారితో మిగిలిన ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ ఇప్పిస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఇన్‌చార్జి డీడీ, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఏజెన్సీలోని ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


ఎం.విశ్వేశ్వరరాజు

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం గురువారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో పలు జిల్లాలకు అధ్యక్షులు, ఇతర ఇన్‌చార్జులను ప్రకటించిన వైసీపీ.. స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించింది. స్థానిక మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని వైసీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించింది.

2న ఏకలవ్య పాఠశాలలు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అరకులోయ, పెదబయలులో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను అక్టోబరు 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జార్ఖండ్ నుంచి వర్చువల్‌గా పెదబయలు, అరకులోయలో రూ.40 కోట్లతో నిర్మించిన పాఠశాలలను ప్రధాని మోదీ ప్రారంభిస్తారన్నారు. అలాగే చింతపల్లి, హుకుంపేట మండలాల్లో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్య మోడల్ పాఠశాల భవనాల నిర్మాణాలకు ప్రధాన మంత్రి భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం అరకులోయ మండలం పకనకుడి గ్రామంలో రెండో విడత పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్థానిక ఆదిమ జాతి గిరిజనులతో ప్రధాని వర్చువల్‌గా సంభాషిస్తారని తెలిపారు.

వరద బాధితులకు ఉచిత రేషన్

- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

పాడేరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సంభవించిన వరదలకు ఇబ్బందులు పడిన బాధిత కుటుంబాలకు ఉచితంగా రేషన్ సరకులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం రాత్రి జీవో విడుదల చేసింది. వరద బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర చొప్పున ఉచితంగా అందించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. వరదల ప్రభావంతో జిల్లాలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చింతూరు, ఎటపాక, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో అధికంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుమారు మూడు వేల కుటుంబాలకు పైగా వరదల ప్రభావానికి గురయ్యాయి. ఆ సమయంలో బాధిత గ్రామాల్లో రూ.3 కోట్ల 66 లక్షల 89 వేలు విలువ చేసే రేషన్, నిత్యావసర సరకులను ఉచితంగా పంపిణీ చేశారు. అయినప్పటికీ మరో మారు వరద బాధితులకు ఉచితంగా రేషన్ సరకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు జీవోను విడుదల చేసింది.

టీచర్లు లేక ఏడు పాఠశాలలు మూసివేత

- ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయిన ఏకోపాధ్యాయులు
- విద్యకు దూరమైన గిరిజన బాలలు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 26:

ఉపాధ్యాయులు లేక మండలంలోని ఏడు పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో మూడు వారాలుగా గిరిజన బాలలు చదువుకు దూరమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు కావడం లేదు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయిన విషయం ఎంఈవోకు కూడా తెలియకపోవడం గమనార్హం.


ఉపాధ్యాయుడి కోసం ఎదురు చూస్తున్న జి.అగ్రహారం విద్యార్థులు, తల్లిదండ్రులు

మండలంలోని జి.అగ్రహారం, వాడమామిడి, కొమ్ములవాడ, పేట్రాయి, తడకపల్లి, తూరుమామిడి, గుడివాడ గ్రామాల్లోని గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఒక్కొక్క పాఠశాలలో 25 నుంచి 35 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే మూడు వారాల క్రితం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పొరుగు గ్రామాలకు బదిలీ చేసుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని వారు విద్యార్థులు, గ్రామస్థులకు కూడా చెప్పలేదు. దీంతో ప్రతి రోజూ విద్యార్థులు పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు కావడం లేదు. పాఠశాలలకు ఉపాధ్యాయులు ఎందుకు రావడంలేదని తల్లిదండ్రులు ఆరా తీయగా ఉపాధ్యాయులు పొరుగు గ్రామాల్లోని పాఠశాలలకు బదిలీపై వెళ్లినట్టు తెలిసింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం పాఠశాలల వద్ద ఆందోళన చేశారు. బదిలీల్లో ఉపాధ్యాయులకు మినహాయింపు ఉన్నప్పటికీ గిరిజన సంక్షేమశాఖ విద్యాశాఖాధికారులు ఏ విధంగా బదిలీ చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన పునఃప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంఈవో టి.సత్యనారాయణకు వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు బదిలీ అయినట్టు తమకు కూడా సమాచారం లేదన్నారు. పాఠశాలలు మూతపడిన విషయమై డీఈవోకి ఫిర్యాదు చేశామని, సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయులను నియమిస్తామని ఆయన తెలిపారు.

క్రైం... crime news

కొత్తపెంటలో పిడుగు పడి రైతు మృతి

దేవరాపల్లి, సెప్టెంబరు 26: మండలంలోని కొత్తపెంటకు చెందిన సూరెడ్డి అప్పలనాయుడు (38) అనే రైతు పిడుగు పడి మృతి చెందాడు. గురువారం పొలంలోకి వెళ్లి గడ్డి మోసుకు వస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, కుమారుడు వరుణ్ (7) ఉన్నారు. అప్పటివరకూ ఎండ ఉధృతంగా కాయగా, అంతలోనే ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది. దీంతో పిడుగు పడడంతో అప్పలనాయుడు మృతి చెందగా, గ్రామంలో విషాదం నెలకొంది.

ఫార్మా కార్మికుడి అనుమానాస్పద మృతి

లంకెలపాలెం, సెప్టెంబరు 26: అనుమానాస్పదంగా ఓ ఫార్మా కార్మికుడు గురువారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశ్వజీత్ రాబర్(25) తన సోదరుడు సూరజ్ రాబర్‌తో కలిసి లంకెలపాలెం కూడలిలో ఓ ఇంట్లో నివాసముంటూ ఫార్మాసిటీలో గల ఓ పరిశ్రమలో కూలి పనులు చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో విశ్వజీత్ రాబర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న సోదరుడు సూరజ్ మందుల కోసం కూడలిలో మెడికల్ షాప్‌నకు వెళ్లాడు. ఆ సమయంలో దుకాణాలు మూసి ఉండడంతో తిరిగి రూమ్‌కు వెళ్లాడు. అప్పటికే విశ్వజీత్ ఇంటి బయటకు వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం సోదరుడు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విశ్వజీత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తూరు, సెప్టెంబరు 26 : రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా వున్నాయి. కశింకోట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ఉంది. అతను సిమెంటు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంటు ధరించి చామనఛాయ రంగులో ఉన్నాడు. 5.3 అడుగుల ఎత్తు ఉంటాడు. సంఘటన స్థలంలో అతనికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీనిపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే 7382058996 ఫోన్ నంబరుకు తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని మాసాహెబ్‌పేట వద్ద బుధవారం తాండవ నదిలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం రాజవరం సమీపంలో తాండవ నది దిబ్బల్లో లభ్యమైనట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్(27) బుధవారం తాండవ నది అవతల ఒడ్డున ఉన్న తమలపాకుల తోటలో తమలపాకుల కోతకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మాసాహెబ్‌పేట వద్ద తాండవ నదిపై రాకపోకలు సాగించడానికి రైతులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న స్తంభాల వంతెన మీద నుంచి వస్తూ జారి పడి గల్లంతైన సంగతి తెలిసిందే. బుధవారం పోలీసులు, యువకుడి బంధువులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ తెలియలేదు. గురువారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా రాజవరం సమీపంలో తాండవ నదిలో పందేల దిబ్బలలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆస్పత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26: గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి ఒక ఉద్యోగి నుంచి అధిక మొత్తంలో కాజేసిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానికంగా ఉన్న ఒక బ్యాంక్ ఉద్యోగి జి. వేణుగోపాలకృష్ణ వాట్సాప్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి యాడ్ చేశాడన్నారు. ఈ వాట్సాప్‌లో 150 మందికి పైగా ఉన్నారని, ఈ గ్రూప్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించాడన్నారు. దీంతో వేణుగోపాలకృష్ణ దఫదఫాలుగా రూ.15 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టాడన్నారు. అంతలోనే ఆ వాట్సాప్ గ్రూప్ నుంచి అందరూ మాయం కావడంతో సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. సైబర్‌సెల్ అధికారులు వేణుగోపాలకృష్ణ వేసిన మొత్తంలో రూ. 5.35 లక్షలు ఫ్రీజ్ చేశారని, ఈ సంఘటన పై వేణుగోపాలకృష్ణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళా రైతు హత్య కేసులో నిందితుడి అరెస్టు

గొలుగొండ, సెప్టెంబరు 26: సాగునీటి వివాద నేపథ్యంలో మహిళపై దాడి చేసి ఆమె ప్రాణాలు పోవడానికి కారకుడైన నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ గ్రామపంచాయతీ పరిధి శ్రీరాంపురంలో బుధవారం ఉదయం పొలం వద్ద రైతు దంపతులు రామకృష్ణ, రామలక్ష్మి (42)పై అదే గ్రామానికి చెందిన చిటికెల తాతీలు కత్తితో దాడికి దిగిన సంగతి తెలిసిందే.. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలైన రుత్తల రామలక్ష్మి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని బంధువులకు గురువారం అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడు తాతీలును అరెస్టు చేసి అనకాపల్లి సివిల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడు మృతురాలికి పెదనాన్న అవుతాడని గుర్తించినట్టు ఎస్ఐ చెప్పారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

కోటవురట్ల, సెప్టెంబరు 26: కోటవురట్లలో పోలీసులు బుధవారం రాత్రి ఓ బెల్టు షాపుపై దాడి చేసి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు న్నారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ గంగారాజు తెలిపిన వివ రాలు ఇలా వున్నాయి. కోటవురట్ల గ్రామానికి చెందిన పినపాత్రుని మాధవి బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు వారు బెల్టు షాపుపై దాడి చేసి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

కొంగసింగి జంక్షన్‌లో ఏడు మద్యం బాటిళ్లు..

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 26: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని కొంగసింగి జంక్షన్‌లో 7 మద్యం క్వార్టర్ బాటిళ్లతో వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్ఐ టి.దివ్య తెలిపారు. చోద్యం గ్రామానికి చెందిన చింతల రమణ (65) బెల్ట్‌షాపులో విక్రయించేందుకు మద్యం తీసుకొనివెళుతుండగా పట్టుబడినట్టు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

జి.వెంకటాపురం వద్ద లారీ బోల్తా

మాకవరపాలెం, సెప్టెంబరు 26: నల్లరాయి లోడుతో వెళుతున్న లారీ మండలంలో జి.వెంకటాపురం వద్ద బోల్తా పడింది. జి.కోడూరు రెవెన్యూలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలో ఉంచి రోజూ రాంబిల్లి మండలంలో నేవల్‌బేస్ పనులకు నల్లరాయి తరలిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం ఉదయం లోడుతో వస్తున్న లారీ జి.వెంకటాపురం వద్ద ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోయి బోల్తా పడింది. లారీ డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయి.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నాతవరం, సెప్టెంబరు 26: మండలంలోని పి.జగ్గంపేట సమీపంలో పేకాటడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.8500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భీమరాజు తెలిపారు. పి.జగ్గంపేటలో గ్రామదేవత జాతర సందర్భంగా కొందరు పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

విశాఖలో మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్

- పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరణ
- కాంట్రాక్టు నర్సుల సమస్యలు పరిష్కరించాలని కోరిన ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ
- వైసీపీ హయాంలో దళితులపై జరిగిన హత్యాకాండపై విచారణ చేయాలన్న దళిత సంఘాల ఐక్య వేదిక
- జర్నలిస్టులకు నాలుగు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని
- జర్నలిస్టు సంఘాల వినతి
- సమస్యల పరిష్కారానికి హామీ


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి విచ్చేసిన ఆయన తొలిరోజు సీఐఐ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం అదానీకి డేటా సెంటర్ నిమిత్తం మధురవాడ ప్రాంతంలో కేటాయించిన కొండను పరిశీలించారు. ఆ తరువాత ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాడిసన్ హోటల్‌లో సమావేశమై ఉక్కు కర్మాగారం సమస్యపై చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. గురువారం ఉదయం సింహాచలం వెళ్లి వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్న లోకేశ్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులను స్వీకరించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. పరస్పర అంగీకార బదిలీలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన వారికి పరిహారం అందించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్‌సర్వీస్‌మన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాలను వైసీపీ అండతో కొందరు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి అనేవారు మంత్రిని కలిశారు. డీఎస్సీ 2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యా దీవెన కింద బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే కారణంతో గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల వేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్ హత్య కోడికత్తి శ్రీను కేసులను ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, నేతలతో మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. మంత్రితో ఫొటోలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహాన్ని చూపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కోండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

పాడేరు డివిజన్‌లో 146 పశు వైద్యాధికారుల పోస్టులు ఖాళీ

చీడికాడ, సెప్టెంబరు 26: అల్లూరి సీతారామరాజు జిల్లాలోనా పాడేరు డివిజన్ పరిధిలో 146 పశువైద్య అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పశుసంవర్ధక శాఖ పాడేరు డివిజన్ ఉపసంచాలకులు సీహెచ్ నర్సింహులు తెలిపారు. మండలంలోని ఖండివరం పశువైద్య కేంద్రాన్ని మాడుగుల పశువైద్యశాఖ ఏడీ చిట్టినాయుడుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ పాడేరు డివిజన్ అల్లూరి జిల్లాలో 700 పోస్టులకు 599 మంది సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలో గల తమ డివిజన్ పరిధిలో ఎనిమిది మండలాలు ఉండగా, 25 పశువైద్యాధికారుల పోస్టులకు నాలుగు ఖాళీగా ఉన్నాయన్నారు. అల్లూరి జిల్లాలో 44 పశువైద్య డాక్టర్లు అవసరం కాగా, 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అల్లూరి జిల్లాలో 700 గోకులం షెడ్లకు రైతులు దరఖాస్తులు చేయగా, అందులో 220 షెడ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లూరి జిల్లాలో 22 పశువులు, 99 గొర్రెలు, మేకలు, 12 లేగదూడలు, 150 కోళ్లు మృతి చెందినట్టు చెప్పారు. నష్టపరిహారం కింద రూ.22 లక్షల 40 వేల 500లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మిశ్రమ దాణా పశువులకు తినిపిస్తే అధిక పాలదిగుబడి పొందవచ్చని సూచించారు. ఆయన వెంట ఖండివరం పశువైద్యాధికారి ఎ.గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ చదువులు

- ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


తరగతి నిర్వహిస్తున్న తుఫాన్ షెల్టర్ భవనం


తరగతి గదిలో శ్లాబు పెచ్చులూడుతున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 26: ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చాలీచాలని గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. గదులు చాలక ఓ తరగతిని శిథిల స్థితిలో ఉన్న తుఫాన్ షెల్టర్‌లో నిర్వహిస్తున్న దయనీయ పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉండేది. హుద్‌హుద్ తుఫాన్‌కు ఈ పాఠశాల భవనాలు దెబ్బతినడంతో పదేళ్ల క్రితం రైల్వే స్టేషన్ రోడ్డులోని జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చు చేశారు. దీంతో జడ్పీ హైస్కూల్ ఆవరణలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయి. జడ్పీ హైస్కూల్‌కు సౌకర్యాలు బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేటాయించిన భవనంలో ఏడు తరగతి గదులు ఉన్నాయి. మరో తరగతిని అక్కడే ఉన్న తుఫాన్ షెల్టర్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ తుఫాన్ షెల్టర్ భవనంలో 8వ తరగతిని నిర్వహిస్తున్నారు. ఈ గది శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. దీనిపై ఎంఈవో-1 మీనాక్షిని వివరణ కోరగా పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయించాల్సి ఉందని తెలిపారు.

తాగునీరు కలుషితం

- నర్సీపట్నంలో కొళాయిల నుంచి బురద నీరు సరఫరా
- వర్షాలే కారణమంటున్న అధికారులు


ధనిమిరెడ్డి వీధిలో పబ్లిక్ కొళాయి నుంచి వస్తున్న బురద నీరు

నర్సీపట్నం, సెప్టెంబరు 26 : మునిసిపాలిటీలో ప్రజలకు కొళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతున్నది. గురువారం ఉదయం కొళాయిల నుంచి వచ్చిన నీరు లేత ఎరుపు రంగులో బురదగా వుండడంతో ప్రజలు ఆందోళన చెందారు. అంటురోగాల బారిన పడతామేమోన్న భయంతో కొంతమంది కొళాయిల నీటిని పట్టుకోవడానికి సంకోచించారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం ప్రాంతాలకు దుగ్గాడ, ఉత్తరవాహిని మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంటారు. వరహా నది నీటి లభ్యత ఆధారంగా తాగునీటి పథకాలు పని చేస్తున్నాయి. కాగా వర్షాల కారణంగా నదిలో కొత్తనీరు చేరడంతో కొళాయిల ద్వారా బురద నీరు వస్తున్నదని అధికారులు అంటున్నారు.

78 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

కె.కోటపాడు, సెప్టెంబరు 26: మన్యం ప్రాంతం నుంచి దేవరాపల్లి, కె.కోటపాడు మీదుగా గంజాయిని తరలిస్తున్న ముఠాను మండలంలోని బత్తివానిపాలెం జంక్షన్‌లో పట్టుకున్నట్టు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం చూడగా ఒడిశాకు చెందిన సుపారా మండల్ (48), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జి.దేవానంద్ (28) కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిద్దరినీ అరెస్టు చేసి 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. కారును సీజ్ చేసినట్టు తెలిపారు. నిందితులను చోడవరం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 26: వడ్డాది కూడలిలో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు పట్టుబడినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను కృష్ణాజిల్లా బంటుమల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించామని, వీరి నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవదానం


సంతోష్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 26: తాను మరణిస్తూ ఇద్దరి జీవితాలకు ఓ యువకుడు వెలుగునిచ్చాడు. వివరాలివి.. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన బి.సంతోష్ ఈ నెల 22న తీవ్రమైన తలనొప్పితో నగరంలోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో చేరాడు. అతని తలలో రక్తస్రావం జరిగిందని వైద్యులు గుర్తించారు. అనంతరం అతడు అపస్మారక స్థితికి చేరాడు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఈ విషయాన్ని యువకుడి తండ్రి సత్తిబాబుకు తెలియజేసి, అవయవదానంపై అవగాహన కల్పించారు. అంతకష్టంలోనూ కుమారుడి అవయవదానానికి తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో యువకుడి కాలేయాన్ని కేర్ ఆస్పత్రికి, ఊపిరితిత్తులను గ్రీన్ ఛానెల్ ద్వారా హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

'తాండవ'కు వరద తాకిడి

రెండు గేట్లు ఎత్తి 1,200 క్యూసెక్కులు విడుదల


స్పిల్‌వే గేట్ల నుంచి నదిలోకి విడిచిపెడుతున్న నీరు

నాతవరం, సెప్టెంబరు 26 : పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లోకి వరద ఉధృతి పెరిగింది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, గురువారం 1,380 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. దీంతో నీటిమట్టం 378.2 అడుగుల వద్ద స్థిరంగా వుంచుతూ స్పిల్‌వే గేట్లు రెండింటిని ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కుడి, ఎడమ కాలువలకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

కారిడార్ నిర్వాసిత రైతుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

నక్కపల్లి, సెప్టెంబరు 26: విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు అన్యాయం చేయకూడదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు అన్నారు. గురువారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అమలాపురం పంచాయతీ పరిధిలోని మూలపర్ర, పాటిమీద గ్రామాలకు చెందిన నిర్వాసితులతో కలిసి ఆందోళన చేశారు. ఈ గ్రామాల్లోని నిర్వాసిత రైతులకు ప్యాకేజీ చెల్లించేందుకు 2010 డిసెంబరు 29 కటాఫ్ తేదీగా రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు ప్రకటించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటారో ? అప్పుడే కటాఫ్ తేదీని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురునాథ్, నానాజీ, శ్రీనివాస్, గోవిందరావు పాల్గొన్నారు.

నేడు బొజ్జన్నకొండ వద్ద ధ్యాన మందిరం ప్రారంభం


బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యాన మందిరం

తుమ్మపాల, సెప్టెంబరు 26 : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యాన మందిరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అలాగే లేజర్ థియేటర్, లైటింగ్ అండ్ సౌండ్ షో, ప్రధాన ముఖద్వారాన్ని కూడా ప్రారంభించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు పర్యాటకశాఖ జిల్లా ఈఈ రమణ తెలిపారు.

సీఎంను కలిసిన మాజీ మంత్రి దాడి


సీఎంతో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు, రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26: అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వరదలు సంభవించి నప్పుడు రేయింబవళ్లు చంద్రబాబు కష్టపడిన తీరును వారు కొనియాడారు.

జిల్లాలో తేలికపాటి జల్లులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. రోజంతా వాతావరణ చల్లబడడంతో పాటు ఏదో ఒక సమయంలో కొద్దిసేపు ఒక మోస్తరు వాన కురిసి తరువాత తెరిపివ్వడంతో జనజీవనానికి ఇబ్బందులు తప్పలేదు. కోటవురట్లలో కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. కృష్ణాదేవిపేట, నాతవరం మండలాల్లో మధ్యాహ్నం వరకు వర్షం పడింది. తరువాత తెరిపిచ్చింది. తాండవ జాలశయంలోకి వరద నీరు చేరడంతో 1200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

ముగిసిన సదరం క్యాంపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. చివరి రోజు అర్హులుగా 35 మందిని గుర్తించినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎస్.రాయవరం, మాకవరపాలెం మండలాల నుంచి 53 మంది శిబిరానికి హాజరైనట్టు చెప్పారు. వైద్యులు గంగాధర్, కనకదుర్గ, అశోక్‌కుమార్ పరీక్షలు జరిపారన్నారు. ఇదిలావుంటే, ఇప్పటి వరకు ఇక్కడ నిర్వహించిన ఈ శిబిరాలకు 711 మంది హాజరు కాగా, అందులో 530 మందిని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు గుర్తించినట్టు ఆయన వివరించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన గిడ్డి ఈశ్వరి


మంత్రి లోకేశ్‌తో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గురువారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని ఆమె మంత్రి లోకేశ్‌ను కోరారు.

ధారకొండ ప్లాంటేషన్ పరిశీలన


ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్ రెడ్డి

సీలేరు, సెప్టెంబరు 26 : సీలేరు రేంజ్ పరిధిలోని ధారకొండ ప్లాంటేషన్‌ను అటవీ శాఖ విశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్ రెడ్డి గురువారం పరిశీలించారు. స్థానిక అటవీ శాఖ సిబ్బందితో కలిసి ధారకొండ వద్ద ప్లాంటేషన్‌లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల రక్షణపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రణాళికాబద్ధంగా మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ధారకొండలో గల టేకు ప్లాంటేషన్ పరిశీలించారు. టేకు చెట్లు స్మగ్లర్ల పాలు కాకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి డీఎఫ్‌ఓ సూర్యనారాయణపడాల్, సీలేరు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి, మార్కెటింగ్‌పై చైతన్యవంతులు కావాలి

▸▸ విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి


వంటకాలను రుచి చూస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి

చింతపల్లి, సెప్టెంబరు 26: విద్యార్థులు స్వయం ఉపాధి, మార్కెటింగ్‌పై చైతన్యవంతులు కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల అవరణలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు వేర్వేరుగా వివిధ వంటకాలు, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫుడ్ ఫెస్టివల్‌ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వంటకాలు, వ్యాపారం, స్వయం ఉపాధిపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస పాత్రుడు, కె.లీలాపావని, డాక్టర్ వి.రమణ, నాయక్, జగదీశ్‌బాబు, ఈశ్వర్, పూర్ణ, కేజియా, రవి పాల్గొన్నారు.


సేల్స్‌మెన్ కుటుంబాలకు ఆర్థిక సాయం


అప్పారావు కుటుంబానికి నగదు అందజేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 26: స్థానిక జీసీసీ బ్రాంచి పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్టు, ఎస్‌హెచ్‌సీ సేల్స్‌మేన్ కుటుంబాలకు ఆర్థిక సాయం గురువారం అందించినట్టు ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు బి.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణపురంలో కాంట్రాక్టు సేల్స్‌మన్ కిముడు అప్పారావు, బౌడ ఎస్‌హెచ్‌జీ సేల్స్‌మన్ బోడపాటి అన్నప్ప అనారోగ్యంతో మృతి చెందారన్నారు. కాంట్రాక్టు సేల్స్‌మేన్ వ్యక్తిగతంగా సేకరించిన నగదును అప్పారావు కుటుంబానికి రూ.45 వేలు, ఎస్‌హెచ్‌జీ సేల్స్‌మన్ కుటుంబానికి రూ.పది వేలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నాయకులు నెహ్రూబాబు, మల్లు పడాల్ పాల్గొన్నారు.

పర్యాటక స్వర్గధామం

... 5వ పేజీ తరువాయి


అనంతగిరి మండలంలో బొర్రా గుహలు

యర్రవరం, పెద బయలు మండలం తారాబు జలపాతాన్ని పర్యాటకులు సందర్శిస్తుంటారు.

రంప మన్యంలో..

జిల్లాలో రంపచోడవరం డివిజన్ పరిధిలో మారేడుమిల్లి మండలంలోని గుడిస హిల్ స్టేషన్ ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుంది. పచ్చదనం పరుచుకున్న ఎత్తైన కొండలు, అక్కడికి చేరేందుకు చేసే ఘాట్ ప్రయాణం సందర్శకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. దీంతో గుడిస హిల్ స్టేషన్ సందర్శన పర్యాటకులకు చక్కని అనుభూతిని మిగులుస్తుంది. అక్కడికి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. అదే మండలంలోని జలతరంగిణి, అమృతధార జలపాతాలు, ఆ మార్గంలోని మరో రెండు వ్యూపాయింట్లు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. చింతూరు మండలం పరిధిలోని పొల్లూరు జలపాతం, జలవిద్యుత్ కేంద్రం సైతం పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇలా జిల్లాలో ఎటు ప్రయాణించినా ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

అభివృద్ధికి దూరం

ఏజెన్సీలో అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని అటు చింతపల్లి మండలం లంబసింగి, యర్రవరం జలపాతం, మారేడుమిల్లి మండలంలోని గుడిస వరకు ఎక్కడ చూసినా కనీస సదుపాయాల లేమితో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కటికి, రణజిల్లెడ, చాపరాయి, కొత్తపల్లి, యర్రవరం, తారాబు జలపాతాల్లో జలకాలాడే క్రమంలో ఆయా ప్రదేశాల్లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు సైతం కనీసం సౌకర్యాలు లేవు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు ఎక్కడా లేవు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అటు రంప ఏజెన్సీ, ఇటు విశాఖ మన్యంలోని ప్రకృతి అందాలను ప్రతి ఏడాది పది లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారనేది ఒక అంచనా. అయితే గత వైసీపీ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో చాలా ప్రాజెక్టులకు మోక్షం కలగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెందుతాయన్న ఆశాభావాన్ని పర్యాటకులు వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సేవలకు ససేమిరా!

▸▸ తల్లిదండ్రులకు నచ్చజెప్పి విద్యార్థిని ఆసుపత్రికి తరలింపు

▸▸ వైద్యుల సూచనతో పోలీసుల రక్షణలో కేజీహెచ్‌కు తరలింపు

కొయ్యూరు, సెప్టెంబరు 26 : అనారోగ్యం బారిన పడిన ఆశ్రమ విద్యార్థికి వైద్య సేవలకు తరలించేందుకు బుధవారం రాత్రి అధికారులు చేసిన ప్రయత్నాలు తెల్లవారు జామున ఫలించాయి. దీంతో విద్యార్థిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో విద్యార్థిని పోలీసుల రక్షణతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.సురేశ్(13) ఈనెల 7వ తేదీన జ్వరం బారిన పడ్డాడు. దీంతో విద్యార్థికి స్థానికంగా వైద్య సేవలందజేశారు. జ్వరం వచ్చిన విషయాన్ని హెచ్‌డబ్ల్యూవో సురేశ్ తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. దీంతో తండ్రి రాముడు 9వ తేదీన పాఠశాలకు వచ్చి కొడుకు నీరసంగా ఉండడంతో రెండు రోజులు ఇంటికి తీసుకువెళతానని హెచ్‌ఎం అనుమతితో తీసుకెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి విద్యార్థి పాఠశాలకు రాకపోవడంతో బుధవారం హెచ్‌డబ్ల్యూవో తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. సురేశ్ ముఖం, కాళ్లు వాపులు వచ్చి కదలలేకుండా ఉన్నట్టు తెలిపారు. దీనిపై హెచ్‌డబ్ల్యూవో ఈ సమాచారాన్ని హెచ్‌ఎంకు, ఏటీడబ్ల్యూవోకు ఇచ్చాడు. దీంతో ఏటీడబ్ల్యూవో విద్యార్థి సురేశ్‌కు వైద్య సేవలకు తరలించేందుకు అవసరమైన అంబులెన్సుతో వార్డెన్‌ను చింతపల్లి మండలం కుడుసింగి గ్రామానికి పంపారు. అయితే సురేశ్‌ను వైద్య సేవలకు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో చేసేది లేక వార్డెన్ తిరిగి విషయాన్ని ఏటీడబ్ల్యూవో సమాచారమందించాడు. పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్, ఏటీడబ్ల్యూవో కుడుసింగికి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చచెప్పి సమీప తాజంగి పీహెచ్‌సీకి రాత్రి 8 గంటల ప్రాంతంలో తరలించారు. అక్కడి


కుటుంబీకులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవో


విద్యార్థి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్

వైద్యులు సమ్మెలో ఉండడంతో నర్సీపట్నం తరలించేందుకు తల్లిదండ్రులు అంగీకరించలేదు. విద్యార్థి సురేశ్‌ను తిరిగి ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధపడగా.. వారిని సముదాయించి రాత్రి 2 గంటలకు అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు సురేశ్‌ను ఇంటికి తీసుకెళ్లిపోతామంటూ విద్యార్థిని ఎత్తుకుని పరుగున రోడ్డెక్కారు. దీంతో విషయాన్ని ఐటీడీఏ పీవోకు సమాచారమందించడంతో ఆయన సూచన మేరకు పోలీసులకు సమాచామందించారు. గురువారం ఉదయం ఇద్దరు కానిస్టేబుళ్ల రక్షణలో సురేశ్‌ను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

నిలకడగా విద్యార్థి ఆరోగ్యం : పీవో

విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించిన డౌనూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థి కె.సురేశ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. విద్యార్థిని వైద్య సేవలకు తరలించేందుకు తల్లిదండ్రులు నిరాకరించారన్నారు. పోలీసుల సహకారంతో కేజీహెచ్‌కు తరలించామని, ప్రస్తుతం విద్యార్థికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. విద్యార్థి సురేశ్‌కు సంపూర్ణ ఆరోగ్యం చేకూరే వరకు తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లే అవకాశం లేకుండా పోలీసుల రక్షణ ఏర్పాటు చేశామని పీవో తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

▸▸ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్

అరకులోయ, సెప్టెంబరు 26: వైసీపీ ప్రభుత్వ హయాంలో 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె విరమణ సమయంలో ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీల యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజులుపాటు సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. ఉన్నతాధికారులు నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుండా ఆందోళన బాట పడతామన్నారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలన్నారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ ఆయాలకు రూ.50 వేలకు బదులు రూ.30 వేలు ఇస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు, నూనె వంటి నిత్యావసర సరకులు అందడం లేదన్నారు. వేతన బకాయిలు కేడా ఉన్నాయన్నారు. బాలామృతం, ఇతర సరకులు సెంటర్ల వద్దకు చేర్చాలన్నారు. మండల కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాల్లో ఉండే సెంటర్లకు సరకులు తీసుకు వెళ్లడం ఇబ్బంది కరంగా ఉందన్నారు. ఈ సరకులు తరలించేందుకు వందలాది రూపాయలను అంగన్‌వాడీలు వ్యయం చేయాల్సి వస్తుందన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల హద్దులు పెరిగాయని, ఇచ్చిన సెల్‌ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా యూనియన్ అధ్యక్షురాలు దురియా నాగమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, యూనియన్ ప్రతినిధులు కొండమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.సుబ్బారావమ్మ

పలు గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

డుంబ్రిగుడ, సెప్టెంబరు 26: మండలంలోని కొర్రా పంచాయతీ పెదపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వంద రోజుల ప్రభుత్వ పాలనను ఇంటింటికి వెళ్లి గిరిజనులకు వివరించారు.ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతోనే గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి బొంజుబాబు ఆనంద్, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి స్వామి, యూత్ నాయకులు చిన్నగెన్ను చంటి పాల్గొన్నారు.

అనంతగిరిలో..

మండలంలోని కొత్తూరులో సర్పంచ్ సీతయ్య, వైస్ సర్పంచ్ గాలి నరేంద్ర ఆధ్వర్యంలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై అవగాహన కల్పించి, స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, టి.ఆనందరావు, పి.జగన్‌బాబు, కార్యదర్శి వరలక్ష్మి, అడ్వకేట్ రత్నంరాజు, వీఆర్వో గంగమ్మ పాల్గొన్నారు.

హుకుంపేటలో..

ఎన్డీయే కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినట్టు స్థానిక ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు, కూటమి నేతలు పేర్కొన్నారు. గురువారం వారు మండలంలోని తాడిపుట్టు, మత్స్యపురం పంచాయతీల్లోని ప్రతి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు సాగరి రాజారావు, చలపతి, భాస్కరరావు, విజయశాంతి, మురళి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి: కొత్తూరులోని ఇది మంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామసభల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

▸▸ ఎంపీడీవో కె.సాయి నవీన్

పాడేరురూరల్, సెప్టెంబరు 26: గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా ఇక నుంచి గ్రామ సభలు ద్వారానే పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి లబ్ది పొందని రైతులను గుర్తించిన అమృత సంస్థ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో 120 మంది గిరిజనులు రేషన్ కార్డుల చేర్పుల కోసం, 67 మంది ఆధార్ కార్డులు అప్‌డేట్ కోసం, 87 మంది రైతులు జాబ్‌కార్డు కోసం, 60 మంది రైతులు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలకు సంబంధించిన సమస్యలపై ఆయా శాఖల అధికారులకు గిరిజన రైతులు దరఖాస్తులను అందించారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, వ్యవసాయశాఖాధికారిణి సూర్యకుమారి, వివిధ శాఖల అధికారులు, అమృత సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయి నవీన్

'పరిసరాల పరిశుభ్రతను విద్యార్థులు బాధ్యతగా చేట్టాలి'

పాడేరురూరల్, సెప్టెంబరు 26: కళాశాల ప్రాంగణంలో, గిరిజన గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బాధ్యతగా చేపట్టాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి కోరారు. ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కళాశాల్లో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వచ్చే నెల 1వ తేదీ వరకు స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత అనే పేర్లతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దత్తత గ్రామాల్లో ప్రజల్లో చైతన్యానికి కృషి చేయాలని సూచించారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.రమేష్‌బాబు, డి.గణేష్, జి.దామోదరం, జి.గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓలు బదిలీ

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసుకున్న షేక్ ఆయేషాను అనకాపల్లి ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న చిన్నికృష్ణను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పాలకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీఓగా బదిలీ చేసి, అక్కడ ఉన్న హనుమంతు జయరాంను ప్రభుత్వానికి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టి.శ్రీలేఖను విశాఖపట్నం ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డి.హుస్సేన్ సాహెబ్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.సంగీత్‌మాధుర్‌ను భీమునిపట్నం ఆర్డీఓగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఎస్.భాస్కరరెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇంకా వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీఓగా, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీ కలెక్టర్ బి.అఖిలను చీరాల ఆర్డీఓగా, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

ఆగివున్న లారీని ఢీకొన్న లారీ

ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 26 : మరమ్మతుల కోసం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.గురువారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సమీపంలోని మొగిలి ఘాట్‌లో చోటుచేసుకున్న ఈ ప్రమాద వివరాలు పోలీసుల కథనం మేరకు... వి.కోట నుంచి కట్టెల లోడుతో భద్రాచలం వెళుతున్న ఓ లారీ బుధవారం మధ్యాహ్నం ఇంజన్ మొగిలి ఘాట్ వద్దకు రాగానే పాడైంది. దీంతో రోడ్డు పక్కనే లారీని ఆపి డ్రైవర్, క్లీనర్ విశ్రాంతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి రెండున్నర గంటల సమయంలో బెంగళూరు నుంచి పంచదార లోడుతో వెళుతున్న మరో లారీ అక్కడే అదుపు తప్పి ఆగివున్న లారీని బలంగా ఢీకొంది.అలాగే పక్కకు తిరిగి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొని పెద్దగోతిలో పడిపోయి నుజ్జునుజ్జైంది.బలంగా ఢీకొనడంతో ఆగివున్న లారీలో డీజిల్ ట్యాంకు పగిలి మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. ఘటనా స్థలానికి డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు చేరుకుని చిత్తూరు, పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించి సహాయక చర్యలు చేపట్టారు. లారీ కింద అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలగూడేనికి చెందిన డ్రైవర్ జామిశెట్టి రామరాజ్ (50) పూర్తిగా కాలి మాంసంముద్దలా మారిపోయివుండడం గమనించారు. తీవ్రంగా గాయపడ్డ క్లీనర్ నాగయ్యను 108అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చక్కెర లోడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన డ్రైవర్ సాయికృష్ణ(31) , వరంగల్లుకు చెందిన క్లీనర్ యాదగిరి(50)లను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. క్లీనర్ యాదగిరి అప్పటికే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను 108అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మరో ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లకు బదిలీలు చేస్తూ కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పద్మనాభం తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌ను పెందుర్తి, పెందుర్తి తహసీల్దార్ కె.వేణుగోపాల్‌ను వీఎంఆర్‌డీఏకు స్పెషల్ తహసీల్దార్‌గా వేశారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం తమసీల్దార్ బి.రవికుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపించారు. వీఎంఆర్‌డీఏలోని కె.ఆనందరావును పద్మనాభం వేశారు. అల్లూరి జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ బి.చిన్నికృష్ణను అనకాపల్లి జిల్లాకు పంపించారు.

సంక్షిప్తంగా..

పటిష్ఠంగా పెసా చట్టం అమలు: ఎంపీపీ


తెలంగాణ మంత్రి సీతక్కతో ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, సెప్టెంబరు 26: షెడ్యూల్డ్ ప్రాంతంలో పెసా చట్టం పటిష్ఠంగా అమలు పర్చేందుకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. గురువారం న్యూఢిల్లీ డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెసా కాన్ఫరెన్స్‌కు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ గిరిజన ప్రాంతాల విస్తరణ (పెసా) చట్టం 1996పై నిపుణులు వివరణాత్మంగా తెలియజేశారన్నారు. ఈ చట్టం గిరిజన ప్రాంతంలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నుంచి జాతీయ కాన్ఫరెన్స్‌కు తనను, చౌడుపల్లి సర్పంచ్ లలితను పంపించిందన్నారు. కాన్ఫరెన్స్‌లో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో అమలుపర్చేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనులు స్వపరిపాలను సాగించేందుకు పెసా చట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

సప్పర్లలో వైద్య శిబిరం విజయవంతం

సీలేరు, సెప్టెంబరు 26 : జీకేవీధి మండలం గాలికొండ, పంచాయతీ సప్పర్లలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైంది. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్య వేదిక, శారదా ట్రస్టు, అల్లూరి విజ్ఞాన కేంద్రం, మెడికవర్ సహకారంతో సప్పర్లలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో 220 మందికి పరీక్షలు నిర్వహించారు. చట్రాపల్లి, జంపర్లోవ, గాలికొండ, ఎర్రగెడ్డ, సప్పర్ల, ఆకులూరు, పంచబంద, నిమ్మగొంది గిరిజనులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు జి.భాగ్యరాజు, శ్రవణ్‌కుమార్, ఎ.కిరణ్‌కుమార్, గిరిజన సంఘ నాయకులు అంపురంగి బుజ్జిబాబు, కొర్రా బాలయ్య గడుతూరి సత్యనారాయణ, బాబూరావు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా వినోద్ కుమార్


డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 26: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మండలాధ్యక్షుడిగా ఎస్.వినోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా కమిటీ సభ్యుడు జర్రా సింహాచలం తెలిపారు. గురువారం జరిగిన మండల సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుతోపాటు గౌరవాధ్యక్షుడుగా బి.వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా కృష్ణప్రసాద్, శ్యాంసుందర్, మహిళా అధ్యక్షులుగా శాంతకుమారి, కార్యదర్శిగా లలితకుమారి, కోశాధికారిగా రవి ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులుగా సత్యనారాయణ, ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సెలర్లుగా జోగన్నపడాల్, పెదబాలరాజు, పరమేశ్వరరావు, వీరయ్యదొర, ఎంవీ రమణ ఎన్నికయ్యారని తెలిపారు.

లక్కలో 16 మందికి కంటి పరీక్షలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 26: మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామంలో హెచ్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళ విభాగ అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 16 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13 మందికి ఆపరేషన్లు అవసరమని విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. వీరిని ఎల్‌వీ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు విశాఖపట్నం తరలించారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఎల్‌వీ కంటి ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి : ఏవో


రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 26: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేపడితే పంట అధిక దిగుబడి సాధ్యమని వ్యవసాయాధికారి శ్రీనివాసబాబు అన్నారు. గురువారం మండలంలోని జోలాపుట్టు పంచాయతీ మొంజపుట్టులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక చదరపు మీటరు విస్తీర్ణంలో ఉండవలసిన మొక్కల సాంద్రతపై పొలంలో కొలతలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. పురుగుల కదలిక, ఉధృతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అలాగే కాఫీ, మిరియాలు, వరి, చోడి, సామలు, తదితర పంటల సాగుపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులను, పశు సంపద ఆవశ్యకతను తెలియజేశారు. అలాగే పలు సమస్యలను రైతులు ఏవో దృష్టికి తీసుకువెళ్లారు.కార్యక్రమంలో వ్యవసాయ కో-ఆర్డినేటర్ ఆనంద్, ఉద్యాన సహాయకులు మోహన్, తరుణ్, కిరణ్, గోపాల్, సీఈవో శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పనులు

▸▸ ఏపీవో లక్ష్మీనారాయణమూర్తి

చింతపల్లి, సెప్టెంబరు 26: ఉపాధి కూలీలందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ మూర్తి అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. సాధారణ ఉపాధి కూలీలకు 100 రోజులు, ఆర్వోఎఫ్ఆర్ భూములు కలిగిన ఉపాధి కూలీలకు 150 రోజులు పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించి, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

బూరుగులో విద్యుత్ సరఫరా ట్రయల్‌రన్

అనంతగిరి, సెప్టెంబరు 26: మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగు గ్రామంలో గురువారం విద్యుత్ సరఫరా ట్రయల్ రన్ విజయవంతమైందని ఏఈ ఏ.రామలింగేశ్వరరావు తెలిపారు. పాడేరు ఈఈ అప్పారావు ఆదేశాల మేరకు మారుమూల గ్రామాలకు గిరిజనులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య పరిష్కారమైందన్నారు. బూరుగు, చీమిడివలస, రాయిపాడు, దేంజినివలస, బొంగిజ, పెదవలస, చినకోనెల, గ్రామాలకు విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, గిరిజనులు మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.